నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శుక్రవారం 3 జనవరి 2025 | NIZAMABAD




## పొగమంచు కమ్మేసిందిలా!

నిజామాబాద్ జిల్లాను పొగమంచు కప్పేసింది. గురువారం ఉదయం జిల్లాకేంద్రంతోపాటు రుద్రూర్, కోటగిరి, మోర్తాడ్ తదితర మండలాల్లో కనుచూపు మేర పొగమంచు దట్టంగా కమ్మేసింది. రోడ్లు కనబడక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకొని ముందుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటల వరకు భానుడు దర్శనమివ్వలేదు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## ఏకసభ్య కమిషన్‌కు

# అభ్యర్థనల వెల్లువ



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న ఎస్సీ కులాల విచారణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

- నిజామాబాద్ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ
- తరలివచ్చిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కులసంఘాల నాయకులు
- అభిప్రాయాలను తెలుసుకున్న రాష్ట్ర చైర్మన్ షమీమ్ అక్తర్

కంఠేశ్వర్, జనవరి 2 : ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం నిర్వహించిన విచారణలో అభ్యర్థనలు వెల్లువెత్తాయి. షెడ్యూల్డ్ కులాల్లో ఉపవర్గీకరణపై వివరణాత్మక అధ్యయనంలో భాగంగా నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ కులాల విచారణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి బహిరంగ విచారణ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు, షెడ్యూల్డ్ కులసంఘాల నాయకులు, వివిధ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరించి, వర్గీకరణపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. మాలలు, మాదిగలు, జంగములు, చిందులు, బుడగ జంగములు, బైండ్ల, మంగులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియపరుస్తూ వినతులను అందజేశారు. సామాజిక, ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య, ఉద్యోగాలు తదితర రంగాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రస్తావిస్తూ పలువురు వర్గీకరణ ఆవశ్యకతను నొక్కి చెప్పగా, వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ పేరుతో ఎస్సీలను విభజించడం సబబు కాదని మరికొందరు కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

**నిర్భయంగా అభిప్రాయాలు తెలుపవచ్చు..**

ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. కమిషన్ ఇప్పటివరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను కలుపుకుని తొమ్మిది జిల్లాల్లో అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. వర్గీకరణ అంశంతో పాటు సామాజిక స్థితిగతులకు సంబంధించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అన్ని వర్గాల వారు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని సూచించారు. అంతకుముందు కమిషన్ చైర్మన్‌కు రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు స్వాగతం పలికారు. వెంట రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకుడు శ్రీధర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులున్నారు. బహిరంగవిచారణ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఆయేషా ఫాతిమా

బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

## 'స్థానిక' పోరులో

# సత్తాచాటుదాం

- ఎన్నికలకు సన్నద్ధంకండి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- హామీల అమలుపై ప్రతి ఒక్కరూ నిలదీయాలి

బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

బోధన్, జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరేసి సత్తా చాటుదామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజలను మోసంచేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయలేక సీఎం రేవంత్‌రెడ్డి చేతులు ఎత్తేశారని, దీంతో ప్రజలు ఆ పార్టీ నాయకులపై గుర్రుగా ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం నిర్వహించిన బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు లేవనెత్తి సర్కార్‌ను ప్రశ్నించాలని సూచించారు. గతంలో కేసీఆర్ అమలుచేసిన పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ముందుకుసాగాలన్నారు. కేసీఆర్, తాము అండగా ఉంటామని, స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**హామీల అమలుపై గళ మెత్తాలి..**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రతి ఒక్కరూ గళమెత్తాల్సిన అవసరముందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామని, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు రైతు భరోసాకు షరతులు విధిస్తూ దగా చేస్తున్నారని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ప్రభుత్వాన్ని అడుక్కోవాలా అంటూ నిలదీశారు.

**రైతు సంక్షేమం పట్టని సర్కార్**



రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తుల పేరిట ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇంకెన్ని దరఖాస్తులను తీసుకుంటారని ప్రశ్నించారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా.. లేదా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తిప్పలు పెడతారా అని ప్రశ్నించారు. కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకుని కాపాడుకున్నారని, అయితే, కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారని విమర్శించారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. సమావేశంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, బోధన్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పి.రవికిరణ్, తెలంగాణ శంకర్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు గోగినేని నర్సయ్య, నర్సింగ్‌రావు, డి.శ్రీరామ్, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు



## శుభాకాంక్షలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

– ఖలీల్‌వాడి, జనవరి 2

## కొనసాగుతున్న హమాలీల సమ్మె

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 2: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని సివిల్ సప్లయిస్ హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండోరోజుకు చేరుకున్నది. కామారెడ్డి, బాన్సువాడ, డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్ మండలాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్ల ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు వేతనాలు చెల్లించాలని, కూలి రేట్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెంచిన రేట్ల ప్రకారం క్వింటాలుకు 29 రూపాయలు చెల్లించాలన్నారు. కార్మికులు, స్వీపర్లకు ఆరోగ్యబీమా రూ. 10 లక్షలు ఇవ్వాలని కోరారు. బోధన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు గోదామునకు తాళం వేసి నిరసన చేపట్టారు.



డిచ్‌పల్లిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న హమాలీలు

## నష్టపరిహారం అందేలా చూడాలి

- బాల్కొండ తహసీల్దార్‌కు మాజీ మంత్రి వేముల ఆదేశం
- అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా



తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

బాల్కొండ, జనవరి 2 : అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల కేంద్రానికి చెందిన పల్లికొండ చిన్ననర్సయ్య ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమై ఆస్తి నష్టం సంభవించింది. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వేముల గురువారం తహసీల్దార్ శ్రీధర్‌కు ఫోన్‌చేసి అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొదటి ప్రాధాన్యం ఇచ్చి, మంజూరు చేసేలా కృషి చేయాలని సూచించారు. అగ్నిప్రమాదాలతో నష్టపోయిన కుటుంబాలకు భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ హయాంలో విధివిధానాలు రూపొందించామని తెలిపారు. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ప్రయోజనమూ అందాలన్నారు.



## రోడ్డు భద్రతా చర్యలు పాటించాలి

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలు, ఫ్లెక్సీలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా చర్యలు పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

–కంఠేశ్వర్, జనవరి 2



కామారెడ్డిలో తాళ్లతో చేతులను బంధించుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

## తాళ్లతో బంధించుకొని నిరసన

**కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె**

కామారెడ్డి/ కంఠేశ్వర్, జనవరి 2 : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట తాళ్లతో చేతులు బంధించుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం మనసు మారాలని కోరుతూ నిజామాబాద్ జిల్లాకేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ వేదపండితులు, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో సర్వమత ప్రార్థనలు చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు, మత పెద్దలు